## అపొస్తులుడైన పౌలు

# ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక

ఈ పత్రిక కూడా అపొస్తులుడైన పౌలు వ్రాసిన పత్రిక. సంఘమునకు శిరస్సైన క్రీస్తుకు క్రైస్తవ భక్తకోటి శరీరమనియు, ఆ దివ్య శరీరమునకు అవయవములైన క్రైస్తవులు సంఘ మహిమార్ధము సత్ ప్రవర్తన కలిగి నడుచుకొనుచు క్రైస్తవ విశ్వాసములో స్థిరపరచబడవలెనని పౌలు ఈ పత్రిక ద్వారా ప్రేరేపించెను. పౌలు ఈ పత్రికను ఎఫెసీయులకు క్రీ.శ 60-63 సంవత్సరముల మధ్యకాలములో వ్రాసియుండవచ్చును.

### ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక-అనుక్రమణిక

| అధ్యా. వచ | పాఠ్య సారాంశము |
|---|---|
| 1:1-14 | శుభవచనములు - దైవస్తుతి |
| 1:15-19 | దేవుని తెలిసికొనుటకొరకు పౌలు ప్రార్థన |
| 1:20-23 | క్రీస్తు పునరుత్థానము నందు కనపరచబడిన దేవుని శక్తి |
| 2:1-10 | రక్షణ దేవుని కృపవలననే కలుగును |
| 2:11-13 | యూదులతో అన్యుల ఐక్యము |
| 2:14-22 | ఆయనయే మనకు సమాధాన కారకుడై యున్నాడు |
| 3:1-12 | పౌలు సువార్త దేవుని మర్మమును బయలు పరచుట |
| 3:13-19 | సువార్తను తెలిసికొనవలెనని పౌలు ప్రార్థన |
| 3:20-21 | క్రీస్తుయేసు మూలముగా సంఘములో మహిమ కలుగును గాక |
| 4:1-6 | ఐక్యత కలిగి యుండుటకై దేవుని పిలుపు |
| 4:7-16 | క్రీస్తు వలె ఉండుటకు, మనము అన్ని విషయములలో ఎదుగుదము |
| 4:17-24 | పాత జీవితము-క్రొత్త జీవితము |
| 4:25-32 | అనుదిన జీవితము కొరకైన విధులు |
| 5:1-2 | మీరు ప్రియులైన పిల్లలవలె దేవుని పోలి నడుచుకొనుడు |
| 5:3-21 | క్రీస్తు నందలి భయముతో ఒకనికొకడు లోబడియుండుడు |
| 5:22-33 | అనుదిన జీవితము కొరకైన విధులు |
| 6:1-4 | తలిదండ్రులయొక్కయు పిల్లల యొక్కయు విధులు, బాధ్యతలు |
| 6:5-9 | యజమానుల యొక్కయు దాసులయొక్కయు విధులు, బాధ్యతలు |
| 6:10-18 | మీరు దేవుడిచ్చు సర్వాంగ కవచమును ధరించుకొనుడు |
| 6:19-24 | ప్రభువైన యేసుక్రీస్తును ప్రేమించు వారికి కృప కలుగును గాక |

---

# ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 1వ అధ్యాయము

### శుభవచనములు

దేవుని చిత్తమువలన క్రీస్తుయేసు అపొస్తలుడైన పౌలు ఎఫెసులో నున్న పరిశుద్ధులును క్రీస్తుయేసు
నందు విశ్వాసులునైన వారికి శుభమని చెప్పి వ్రాయునది. 2 మన తండ్రియైన దేవుని నుండియు ప్రభువైన
యేసుక్రీస్తు నుండియు మీకు కృపయు సమాధానమును కలుగును గాక.

### దైవ స్తుతి

3 మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క తండ్రియగు దేవుడు స్తుతింపబడును గాక. ఆయన క్రీస్తునందు
పరలోక విషయములలో ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదమును మనకనుగ్రహించెను. 4 ఎట్లనగా, తన
ప్రియునియందు తాను ఉచితముగా మన కనుగ్రహించిన తన కృపా మహిమకు కీర్తి కలుగునట్లు, 5 తన
చిత్తప్రకారమైన దయాసంకల్పము చొప్పున యేసుక్రీస్తు ద్వారా తనకు కుమారులుగా స్వీకరించుటకై,
మనలను ముందుగా తన కోసము నిర్ణయించుకొని, మనము తన యెదుట పరిశుద్ధులమును నిర్దోషులమునై
యుండవలెనని జగత్తు పునాది వేయబడక మునుపే, 6 ప్రేమ చేత ఆయన క్రీస్తులో మనలను
ఏర్పరచుకొనెను. 7 దేవుని కృపా మహదైశ్వర్యమును బట్టి ఆ ప్రియుని యందు ఆయన రక్తము వలన మనకు
విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగియున్నది. 8 కాలము సంపూర్ణమైనప్పుడు
జరుగవలసిన ఏర్పాటును బట్టి, 9 ఆయన తన దయాసంకల్పము చొప్పున తన చిత్తమును గూర్చిన
మర్మమును మనకు తెలియజేసి, మనకు సంపూర్ణమైన జ్ఞానవివేచన కలుగుటకు, ఆ కృపను మనయెడల
విస్తరింపజేసెను. 10 ఈ సంకల్పమును బట్టి ఆయన పరలోకములో ఉన్నవే గాని, భూమిమీద ఉన్నవే గాని
సమస్తమును క్రీస్తునందు ఏకముగా సమకూర్చవలెనని తనలో తాను నిర్ణయించుకొనెను. 11 మరియు క్రీస్తు
నందు ముందుగా నిరీక్షించిన మనము తన మహిమకు కీర్తి కలుగజేయవలెనని 12 దేవుడు తన
చిత్తప్రకారమైన సంకల్పమును బట్టి మనలను ముందుగా నిర్ణయించి, ఆయన యందు స్వాస్థ్యముగా
ఏర్పరచెను. ఆయన తన చిత్తానుసారముగా జేసిన నిర్ణయము చొప్పున సమస్తకార్యములను
జరిగించుచున్నాడు. 13 మీరును సత్య వాక్యమును అనగా మీ రక్షణ సువార్తను విని క్రీస్తునందు
విశ్వాసముంచి వాగ్దానము చేయబడిన ఆత్మ చేత ముద్రింపబడితిరి. 14 దేవుని మహిమకు కీర్తి కలుగుటకై,
ఆయన సంపాదించుకొనిన ప్రజలకు విమోచనము కలుగు నిమిత్తము ఈ ఆత్మ మన స్వాస్థ్యమునకు
సంచకరువుగా ఉన్నాడు.

### దేవుని తెలిసికొనుట కొరకు పౌలు ప్రార్థన.

15 ఈ హేతువు చేత, ప్రభువైన యేసునందలి మీ విశ్వాసమును గూర్చియు, పరిశుద్ధులందరి
యెడల మీరు చూపుచున్న విశ్వాసమును గూర్చియు నేను వినినప్పటి నుండి 16 మీ విషయమై మానక
దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను. 17 మరియు మీ మనోనేత్రములు వెలిగింపబడినందున, ఆయన
మిమ్మును పిలిచిన పిలుపువలననైన నిరీక్షణ యెట్టిదో, 18 పరిశుద్ధులలో ఆయన స్వాస్థ్యము యొక్క
మహిమైశ్వర్యమెట్టిదో, ఆయన క్రీస్తునందు వినియోగపరచిన బలాతిశయమును బట్టి విశ్వసించు మనయందు

ఆయన చూపుచున్న తన శక్తి యొక్క అపరితమైన మహత్యమెట్టిదో, 19 మీరు తెలిసికొనవలెనని, మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క దేవుడైన మహిమాస్వరూపియగు తండ్రి తన్ను తెలిసికొనుట యందు మీకు జ్ఞానమును ప్రత్యక్షతయును గల మనస్సు అనుగ్రహించునట్లు, నేను నా ప్రార్థనలయందు మిమ్మును గూర్చి విజ్ఞాపన చేయుచున్నాను.

## క్రీస్తు పునరుత్థానమునందు కనపరచబడిన దేవుని శక్తి

20 ఆయన ఆ బలాతిశయము చేత క్రీస్తును మృతులలో నుండిలేపి సమస్తమైన ఆధిపత్యము కంటెను అధికారము కంటెను శక్తికంటెను ప్రభుత్వము కంటెను ఈ యుగమునందే కాక రాబోవు యుగమునందును పేరు పొందిన 21 ప్రతి నామము కంటెను, ఎంతో హెచ్చుగా పరలోకమునందు ఆయనను తన కుడిపార్శ్వమున కూర్చుండబెట్టుకొని యున్నాడు. 22 మరియు సమస్తమును ఆయన పాదములక్రింద ఉంచి, సమస్తముపైని ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను. 23 ఆ సంఘము ఆయన శరీరము, సమస్తమును పూర్తిగా నింపుచున్న వాని సంపూర్ణతయైయున్నది.